RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

సంపుటి : 13 | సంచిక : 89 | రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 21 శనివారం,జూన్,2025 | పేజీలు : 4+ | ₹ 3

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

## - సీఎస్ రామకృష్ణారావు-

- అధికారుల బృందంతో కలిసి శంషాబాద్ మున్సిపాలిటీ ఆకస్మికంగా సందర్శించిన సీఎస్ రామకృష్ణారావు
- ఔటర్ పరిసరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలే లక్ష్యంగా అధికారుల బృందంతో సీఎస్ టూర్
- శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారుల బృందంతో సీఎస్ సమీక్ష
- సీఎస్ బృందానికి నివేదిక సమర్పించిన శంషాబాద్ మున్సిపల్ కమీషనర్ సుమన్ రావు












రాజేంద్రనగర్, జూన్, 20(నగరనిజం ప్రతినిధి):ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలతో పాటు గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు రచించబోతున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ప్రకటించారు. మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులను పరిశీలించబోతున్నట్లు చెప్పారు.హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఎంఐయుడి) ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలమర్తి,హెచ్ఎండిఏ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితర ఉన్నతాధికారుల బృందంతో కలిసి సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం నాడు జిల్లాలోని శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు అధికారుల బృందంతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ మున్సిపల్ కమీషనర్ సుమన్ రావు శంషాబాద్ మున్సిపాలిటీ కి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అధికారులకు వివరించారు. సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎస్ రామకృష్ణారావు... హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలతోపాటు గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాల గూర్చి ఆరా తీయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఆయా మున్సిపాలిటీలో పర్యటనలు జరపనున్నట్లు వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో టాక్సులు ఏ మేరకు వసూలు చేస్తున్నారు,సిబ్బంది పనితీరు ఎలా ఉంది, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుతున్నాయా లేదా, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించబోతున్నట్లు సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో టాక్స్ ల వసూలును సరళతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 60 వేల జనాభా ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అనుగుణంగా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లాంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించనున్నట్లు సీఎస్ రామకృష్ణారావు ప్రకటించారు. జీవో 111 నిబంధనల కారణంగా నిధుల కొరత, అభివృద్ధికి అడ్డంకుల అంశంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎస్ రామకృష్ణారావు సమాధానం ఇస్తూ... నిధుల కొరతను అధిగమించడానికి టాక్స్ లను సరళతరం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తున్నట్లు చెప్పారు. శంషాబాద్ తో పాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మొత్తం 26 మున్సిపాలిటీలు ఉన్నాయని, వీటిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని ఆయన అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తే ప్రభుత్వం నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటుందన్నారు.

- ఎకో పార్కును సందర్శించిన సీఎస్, అధికారుల బృందం

శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం లో సమీక్ష సమావేశం అనంతరం సీఎస్ రామకృష్ణారావు అధికారుల బృందంతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్ గూడ వద్ద ఎకో పార్క్ ను సందర్శించారు. ఏకో పార్క్ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ జంట నగరాల ప్రజానీకానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పంచడానికి ఏకో పార్క్ ను మరింతగా అభివృద్ధి చేస్తామని సీఎస్ రామకృష్ణారావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డిఓ కే వెంకట్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కమీషనర్ సుమన్ రావు, శంషాబాద్ ఎమ్మార్వో రవీందర్ దత్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి మనోహర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

- తెలంగాణ ప్రభుత్వానికి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి.



హైదరాబాద్, జూన్ 20 (నగరనిజం న్యూస్ ) వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ సీజన్‌లో ప్రతి రైతు కుటుంబం కనీసం కొంత మేరకైనా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే తెలంగాణ రైతులు కూడా ఆధునిక, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందని కౌన్సిల్ అభిప్రాయపడింది. సాంప్రదాయ రసాయన ఆధారిత వ్యవసాయ పద్ధతులు పర్యావరణ కాలుష్యానికి దారితీయడమే కాకుండా, రసాయన వ్యర్థాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని గుర్తు చేసింది. ప్రజల్లో సేంద్రియ ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న అవగాహన, వాటి కోసం పెరుగుతున్న డిమాండ్‌ను రైతులు గుర్తించాలని సూచించింది. రసాయన విధానాలకే పరిమితమైతే భవిష్యత్తులో మార్కెట్ కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ సమస్యను నివారించడానికి, ప్రభుత్వం ప్రకృతి సేద్యంపై రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, 100 శాతం రాయితీ, ప్రత్యేక మార్కెట్ వసతి కల్పించి ప్రోత్సహించాలని %ఋూణజ% అధ్యక్షుడు రంగయ్య శుక్రవారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. మార్పు వైపు ఆలోచించకుండా ప్రభుత్వాలు పాత పద్ధతులనే కొనసాగిస్తే అది రైతులకు మోసం చేసినట్టే అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పించడమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని స్పష్టం చేసింది. నేడు ప్రపంచం మొత్తం సేంద్రియ ఉత్పత్తుల వైపు చూస్తున్న వాస్తవం ప్రభుత్వం గుర్తించాలని, తెలంగాణ రైతును ఆదిశగా నడిపిస్తే దేశం మొత్తం. ఆచరించే అవకాశం ఉందని రంగయ్య హెచ్చరించారు.

# వేతన సవరణ జీవోలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలను కూడా చేర్చాలి

- ఉద్యోగులకు హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలి
- వేములవాడ ,భద్రాచలం ,బాసర ,కొండగట్టు, కొమురవెల్లి ,యాదగిరిగుట్ట ఉద్యోగుల భేటీ
- సమస్యలను దేవాదాయ శాఖ మంత్రికి నివేదిస్తామని జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు వెల్లడి
- పలు కీలక అంశాలపై చర్చ, తీర్మానాలు





యాదగిరిగుట్ట, జూన్ 20 (నగరనిజం న్యూస్ ): రాబోవు వేతన సవరణ జీవోలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలను కూడా చేర్చాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలని యాదగిరిగుట్టలో జరిగిన ప్రధాన రాష్ట్ర దేవాలయాల కీలక సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమావేశంలో వేములవాడ , భద్రాచలం, బాసర కొండగట్టు, కొమురవెల్లి, యాదగిరిగుట్ట దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించి తీర్మానించారు. సమావేశ తీర్మానాలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఎన్జీవోల సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీష్ సభ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పెండింగ్ లో ఉన్న హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని సమావేశం కోరింది. జీవో 888 ను దేవాలయంలో ఉన్న పోస్టులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సవరణ చేయాలని, అదేవిధంగా ఉద్యోగులకు అనుగుణంగా జీవో 261తగు సవరణ చేయాలని కూడా కోరింది. పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను, అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో వారి వారి మాతృ సంస్థలకు బదిలీ చేయాలని, లేదా డిప్యూటేషన్ పై పంపించాలని కూడా సమావేశం తీర్మానించింది. పని భారం తగ్గించేందుకు వీలుగా అవసరమైన మేరకు క్యాడర్ స్ట్రెంతు అనుమతించాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేయాలని డిమాండ్ చేసింది. సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరింది. సమావేశ నిర్ణయాలను త్వరలోనే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను కలిసి విన్నవిస్తామని గజవెల్లి రమేష్ బాబు మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో మారం జగదీష్ తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, టిఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గము, యాదాద్రి భువనగిరి జిల్లా టీఎన్జీవోల అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి సహా వేములవాడ అధ్యక్షుడు కూరగాయల శ్రీను, భద్రాచలం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి , బాసర నుంచి సుదర్శన్ గౌడ్, కొండగట్టునుండి చందు , కొమరవెల్లి నుండి అధ్యక్షుడు మల్లికార్జున శర్మ అదే విధంగా యాదగిరిగుట్ట దేవస్థానం నుండి జె కృష్ణ, దయానందు పాల్గొన్నారు.

# స్వయంగా విచ్చేసే ప్రముఖులకే ప్రోటోకాల్ దర్శనం

- యాదగిరిగుట్ట దేవస్థానం కీలక నిర్ణయాలు
- సాంప్రదాయ దుస్తులు ధరిస్తేనే అంతరాలయంలోకి అనుమతి
- భక్తుల సౌకర్యార్థం సైన్ బోర్డులు ,పెయింటింగులు
- అభిషేకం జల సంప్రోక్షణ, హారతికి స్థల నిర్ధారణ





యాదగిరిగుట్ట , జూన్ 20 (నగరనిజం న్యూస్ ): మరింత అభివృద్ధి దిశగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకనుంచి సాంప్రదాయ దుస్తులు ధరించిన వారిని మాత్రమే అంతరాలయంలోకి అనుమతించాలని, 65వేల నుండి లక్ష వరకు భక్తులు విచ్చేసే శని, ఆదివారం రోజులలో ప్రోటోకాల్ ప్రకారం స్వయంగా విచ్చేసే విఐపి లకు మాత్రమే ప్రోటోకాల్ దర్శనాలు కల్పించాలని, తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా ప్రోటోకాల్ దర్శనాలకు కూడా టికెట్ తప్పనిసరి చేస్తూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది .గురువారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. వెంకట్రావు ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, శాఖాధిపతులు ,ఇంజనీరింగ్ అధికారులు, భద్రత అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భక్తులలో ఆధ్యాత్మిక భావన పెంపొందించే దిశగా శ్లోకాలు, వాటి అర్థాలు వివరిస్తూ పరిసర ప్రాంతాలలో సైన్ బోర్డులు, పెయింటింగులు ఏర్పాటు చేయాలని ఈవో వెంకట్రావు ఆదేశించారు. అభిషేక జల సంప్రోక్షణ, హారతి స్వీకరణకు వీలుగా ఆలయంలో తగు స్థలం ఏర్పాటు చేయాలని ప్రధాన అర్చకులకు ఆయన సూచించారు. అంతరాలయంలో ప్రవేశానికి భక్తులు విధిగా సాంప్రదాయ దుస్తులు ధరించే వారికే అనుమతించాలని కూడా సూచించారు. దేవస్థానం భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ఈ సందర్భంగా ఎస్ పి ఎఫ్ సిబ్బందికి సూచించారు. తనదైన శైలిలో సంస్కరణలు చేస్తూ,ప్రక్షాళన చేపడుతూ దేవస్థానాన్ని తీర్చిదిద్దుతున్న ఈవో వెంకట్రావు కృషి పై భక్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

నగరనిజం

21 శనివారం,జూన్,2025

# 26 నుండి గుట్ట మండలంలో గ్రామ టాస్కా కమిటీలు

- ఇక స్థానికంగానే సమస్యల పరిష్కారం : అధ్యక్షుడు ముడుంబై మోహనాచార్య
- అవగాహన సదస్సులు విజయవంతం అయ్యాయని ప్రధాన కార్యదర్శి పులి గౌడ్ చక్రపాణి వెల్లడి



యాదగిరిగుట్ట, జూన్ 20– (నగరనిజం న్యూస్ ) : ఈనెల 26వ తేదీ నుండి యాదగిరిగుట్ట మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి గ్రామ టాస్కా కమిటీలను నియమిస్తామని మండల టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ) అధ్యక్షుడు ముడుంబై మోహనాచార్య తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీల నియామకాలతో ఆయా గ్రామాలలో నివసిస్తున్న వయోజనుల సమస్యలు స్థానికంగానే దాదాపుగా పరిష్కారం అవుతాయని అన్నారు . వృద్ధులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను రూపొందించాయని అయితే వాటి గురించి తగు ప్రచారం లేకపోవడంతో అవగాహన కొరవ డిందన్నారు . అదేవిధంగా వయోజనులకు చట్టపరంగా ఉన్న హక్కులను వినియోగించుకోవాలని తద్వారా సమస్యల నుంచి ఉపశమనం పొందాలన్నారు. ఈ సందర్భంగా మండల టాస్కా ప్రధాన కార్యదర్శి పులుగం చక్రపాణి మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నిర్వహించిన అవగాహన సదస్సుల వివరాలను వెల్లడించారు. అవి సంపూర్ణంగా విజయవంతం అయ్యాయని అన్నారు. గ్రామ కమిటీల ఏర్పాటుకు వయోజనులలో ఉత్సాహం వ్యక్తం అయిందన్నారు. కార్యవర్గ సమావేశంలో యాదాద్రి బోనగిరి టాస్కా జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాగి సహదేవు , నాయకులు కలకుంట్ల బాల్ నరసయ్య, ఎం నరసింహారెడ్డి, నూకల సుధాకర్ రెడ్డి, గంగసాని హనుమంతరావు, కోల ఆంజనేయులు, సూదగాని గోపాల్, గుంటి యాదగిరి, ఎరుకల స్వామి, దూశెట్టి బాలరాజు గౌడ్, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, వెలిశాల బ్రహ్మాచారి ,పులుగం బాలరాజు, గౌడ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పుర ప్రజలకు పన్నుపోటు తప్పదా...?

- పన్ను పోటుకు సంకేతాలు ఇచ్చిన సీఎస్ రామకృష్ణారావు
- ప్రాపర్టీ టాక్స్ ను మరింత వృద్ధి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎస్





రాజేంద్రనగర్, జూన్ 20(నగరనిజం ప్రతినిధి): హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీల ప్రజలకు త్వరలోనే పన్నుపోటు తప్పదా.... అధికారులు ప్రాపర్టీ టాక్స్ ను మరింతగా పెంచబోతున్నారా...? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు కదన రంగంలోకి దిగారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు. ఈ మేరకు వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలను లక్ష్యంగా చేసుకొని అధికార యంత్రాంగం తో కలిసి శుక్రవారం నాడు మున్సిపాలిటీల్లో విస్తృత పర్యటనలు చేపట్టారు సీఎస్. వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో జనాభా ఎంత ఉంది, ప్రాపర్టీ టాక్స్ ఎంత వసూలు అవుతుంది, సిబ్బంది ఎంత మంది ఉన్నారు,ఏ మేరకు అభివృద్ధి పనులు చేపట్టారు, మౌలిక సదుపాయాల పరిస్థితి ఏమిటి అనే అంశాలను లక్ష్యంగా చేసుకొని సీఎస్ రామకృష్ణారావు సారధ్యంలోని అధికారుల బృందం శంషాబాద్ లో పర్యటించింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 60 వేల జనాభా ఉన్నట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశంపై సీఎస్ అధికార యంత్రాంగం తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీవో ట్రిబుల్ వన్ నిబంధనలు కారణంగా శంషాబాద్ ప్రాంతం అభివృద్ధికి నిధుల కొరత ఇబ్బందిగా ఉంటుందన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. అయితే నిధుల కొరతను అధిగమించడానికి ప్రాపర్టీ టాక్స్ ను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మీడియాతో మాట్లాడిన సీఎస్ రామకృష్ణారావు...ప్రాపర్టీ టాక్స్ ను మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని అధికార యంత్రాంగానికి ఖచ్చితమైన సంకేతాలు ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే త్వరలోనే శంషాబాద్ మున్సిపాలిటీ తో పాటు చివరి ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో ప్రజలకు పన్ను పోటు తప్పేలా కనిపించడం లేదు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలంటే నిధుల కొరతను అధిగమించాల్సిన అవసరం ఉందని సీఎస్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం సీఎస్ రామకృష్ణారావు అధికార యంత్రాంగాన్ని వెంటబెట్టుకొని వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలను లెక్కగడుతున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో జనాబా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి ప్రాపర్టీ టాక్స్ పెంచడమే మార్గమని ఆయన అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. సో... హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజానీకం పన్నుపోటుకు సిద్ధం కాక తప్పదు...!

# అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ



ఇబ్రహీంపట్నం, జూన్ 20 ( నగరనిజం ) : ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పాషా, కార్యదర్శి ప్రణయ్ అన్నారు. శుక్రవారం అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో అఖిల భారత మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 27న కేరళ రాష్ట్రంలో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ దేశంలో విద్యారంగ సమస్యలపై, యునివర్సిటీ సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ తో నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని పోరాటాలకు సిద్ధం అవుతామని తెలిపారు. ఈ దేశంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే ఆశయాల కోసం నిరంతరం ఉద్యమిస్తామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ సంఘానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయాలి
- సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పి.కృష్ణ
- మంచాల తహశీల్దార్ కు సీపీఐ(ఎం) వినతి



ఇబ్రహీంపట్నం, జూన్ 20 ( నగరనిజం ) : రైతుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ అన్నారు. అర్హులైన రైతులకు రైతు భరోసా సాయం అందేలా చూడాలని కోరారు. మంచాల మండల పరిధిలోని బండలేమూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ ఎంవి ప్రసాద్ రావుకు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోచమోని కృష్ణ మాట్లాడుతూ... బండలేమూర్ లో భూసమస్యలతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో వాటి పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రామ శివారు గుట్టల్లో ఉన్న పశువుల బెడద వల్ల పొలాల్లో రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 20 ఏళ్లుగా అడవిలో వందలాదిగా పశువులు ఉన్నాయని అవి రైతులు వేసిన పంటలను నష్టం చేస్తున్నాయని అన్నారు. వాటి నుండి పంటలను కాపాడుకోలేక రైతులు తమ పొలాల్లో పంటలు వేయడమే మానేయడం జరిగిందని చెప్పారు. సుమారుగా 20 ఏళ్లుగా పంటలు వేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుధాయకమైన పొలాల్లో చెట్లు పెరిగిపోయి అడివి ప్రాంతంగా మారిందని వాపోయారు. దీనివలన రైతు భరోసా సహాయం కూడా అందిండం లేదని అన్నారు. పశువులను పట్టుకొని గోశాలలకు తరలించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. కావున ఇప్పటికైనా పశువులన్నిటిని ఈ ప్రాంతం నుండి పట్టుకెళ్లాలని డిమాండ్ చేశారు. పశువులు లేకుండా అయితే రైతులు తమ పొలాల్లో పంటలు సాగు చేసుకుంటారని అన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా సహాయం కూడా అందుతుందని చెప్పారు. పశువుల బెడద నుండి కాపాడి రైతులు పంటలు పండించుకునేలా చూడాలని అలాగే రైతు భరోసా సహాయం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె వీరయ్య, మాజీ ఎంపీటీసీ వట్టి వెంకటేష్, మల్లం జంగయ్య, బద్దుల మల్లేష్, జర్పుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# చింతపట్లలో అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

- ఎస్సీ కాలనీలో లేఅవుట్ చేసి పట్టాలు పంపిణీ చేయాలి
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కోరిన చింతపట్ల గ్రామస్థులు



ఇబ్రహీంపట్నం, జూన్ 20 ( నగరనిజం ) : యాచారం మండలం చింతపట్ల గ్రామంలో గతంలో సర్వే నెంబర్ 209 లో 0.29 గుంటలు, సర్వే నెంబర్ 210 లో 1.35 గుంటలు ప్రభుత్వం 2001లో పట్టాధారుని నుండి కొనుగోలు చేసింది. అయితే అప్పటి నుండి ఇప్పటివరకు ఆ భూమిని ఎవరికి పంచలేదు. అయితే అట్టి భూమిని అర్హులైన నిరుపేదలకు 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శుక్రవారం గ్రామస్థులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో తీసుకున్న భూమిని ఇప్పటివరకు ఎవరికి పట్టాలు ఇవ్వలేదన్నారు. పట్టదారుల నుండి తీసుకొని కొన్ని సంవత్సరాలు గడిచిన ఎవరికి ఇవ్వకపోవడంతో ఆ భూమి నిరూపయోగంగా ఉందని తెలిపారు. అట్టి భూమిని సర్వే చేయించి లే అవుట్ చేసి అర్హులైన నిరుపేదలైన ఎస్సీ కుటుంబాలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. గ్రామంలో ఇండ్లు లేక ఎంతోమంది నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కిరాయి ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నిరుపేదలను గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఇండ్లు లేని వారికి న్యాయం చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సర్వే చేయించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అమృతా సాగర్, లిక్కీ పాండురంగారెడ్డి, ఇటుకల లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

# అసైన్మెంట్ భూములున్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలి

- అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి
- ఎమ్మెల్యే మల్ రెడ్డిని కోరిన కొత్తపల్లి గ్రామస్థులు



ఇబ్రహీంపట్నం, జూన్ 20 ( నగరనిజం ) : యాచారం మండలం కొత్తపల్లిలో అసైన్మెంట్ భూములు కలిగిన రైతులకు రైతు భరోసా కల్పించాలని కొత్తపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన రైతులకు రైతు భరోసా కల్పించాలన్నారు. పట్టా భూములు కలిగిన రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వడం లేదని అన్నారు. అసైన్డ్ మెంట్ భూముల్లో ఎక్కువగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు మాత్రమే ఉన్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొత్తపల్లి గ్రామానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. రైతుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కొత్తపల్లి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఎండీ రని, నాగిల్ల వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ కావలి జగన్, రవీందర్ రెడ్డి, లింగారెడ్డి, జంగయ్య, విప్లవ కుమార్, చంద్రయ్య, యాదయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ నేత సానెం శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి లభించడంతో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎస్.బి కరుణాకర్ గౌడ్, ఎం పరమేష్ ఘనంగా సన్మానం



రాజేంద్రనగర్, జూన్ 20(నగరనిజం ప్రతినిధి):పీసీసీ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సానెం శ్రీనివాస్ గౌడ్ ను పలువురు శంషాబాద్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేతలు ఎస్. బీ కరుణాకర్ గౌడ్ (శంషాబాద్ సహకార బ్యాంకు మాజీ చైర్మన్), ఎం.పరమేష్ పీసీసీ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన సానెం శ్రీనివాస్ గౌడ్ నివాసానికి వెళ్లి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులకు పీసీసీ లో సముచిత స్థానం కల్పించినందుకు కరుణాకర్ గౌడ్, పరమేష్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు చెప్పారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందిన కాంగ్రెస్ నేతలకు రాష్ట్ర కాంగ్రెస్ లో క్రియాశీలక బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# శరవేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం

- రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు..కర్రి వేణూమాధవ్
- రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు..తాటికొండ రంగబాబు



బ్రమ్మం గారి మఠం,జూన్ 20(నగరనిజం ప్రతినిధి):జాతీయ ఓ.బీ.సీ. వ్యవహాల ఢిల్లీ ఇన్చార్జ్ కర్రి వేణు మాధవ్ ఇటీవల కారు ప్రమాదం నుండి కోలుకొని మళ్ళీ జనబాహుళ్యానికి వచ్చే క్రమంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆశీస్సులు తీసుకొనేందుకు గాను బ్రహ్మం గారి మఠంఅధికారులు దగ్గరుండి స్వామి, అమ్మవార్ల ధర్శనం చేయించి శుభాశీర్వచనం ఇవ్వడం జరిగింది. తదుపరి ఈ.ఓ. శంకరబాలాజీ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో . మఠం అభివృద్ధి కొరకు చేపట్టిన కార్యక్రమాలు స్వయంగా వివరించడం జరిగింది. చుట్టూ రాతి ప్రహరీ గోడ,, గోవిందమాంబ అన్నప్రసాధ శాల నిర్మాణం, మరియు స్వామి, అమ్మ వార్ల కళ్యాణ మహోత్సవ మండపం,, దేవాలయం చుట్టూ ఆక్రమణల తొలగింపు,, గ్రీనరీ పెంపొందించే కార్యక్రమం,, గత యాభై ఏళ్ళగా దేవాలయం ఆద్వర్యంలో ఉన్న బీడుభూమిలో పంట సాగు కొరకు బోర్లు వేయించి అందుబాటులో తీసుకురావడం తదితర వివరాలు తెలియజేసారుప్రస్తుత ప్రభుత్వ కాలపరిమితి పూర్తయ్యేసరికి మరింత అధునాతన వసతి గృహాలు అందుబాటులో తీసుకురావడానికి కృషి చేస్తున్నాట్లుగా తెలియజేసారు.

# నార్త్ లాలగూడ శ్రీరామ మందిరం నూతన కమిటి ఎన్నిక

- సికింద్రాబాద్ ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్, ఆదం భరత్ కుమార్ ప్రత్యేక శ్రద్ధతో..







సికింద్రాబాద్,జూన్ 20(నగరనిజం ప్రతినిధి): సికింద్రాబాద్ నియోజకవర్గం, అడ్డగుట్ట డివిజన్ నార్త్ లాలగూడ శ్రీ రామ మందిరము చాలా పురాతనమైన ఆలయం, ఈయొక్క ఆలయం గత మూడు నాలుగు తరాలు పూజలు నిర్వహించిన చరిత్ర. అలాంటి ఆలయానికి గత పది సంవత్సరాలు పాలించిన ప్రభుత్వం కనీసం దేవాలయ కమిటిని వేయకుండా దేవాలయ అభివృద్ధికి అడ్డుపడింది. ఈ క్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్, సోదరుడు ఆదం భరత్ కుమార్ చొరవతో ఈయొక్క కమిటిని నియమించడం జరిగింది.ఈయొక్క కార్యక్రమం ఆలయ ఈవో రవి కుమార్, ఇన్స్పెక్టర్ అండాలు చేతులు మీదుగా ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది.ఇ. బి. రాజారావు చైర్మన్ గా, దొమ్మాటి శివకుమార్, శ్రీనివాస్, సంతోష్ చారి, జగదీష్, శంకర్, శైలజ ట్రస్ట్ బోర్డ్ మెంబర్లుగా,ఎక్సఫిషియో మెంబర్ గా నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు.ఈసందర్భంగా కమిటి వారు మాట్లాడుతూ మాకు ఈయొక్క దేవాలయమునకు సేవచేసే భాగ్యం కలిగించి నందుకు ఆదం కుటుంబానికి ప్రతేక ధన్యవాదములు తెలిపారు. ఈయొక్క కార్యక్రమంలో చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయం చైర్మన్ గుంటి కృష్ణ, మరియు కమిటీ సభ్యులు, తుకారం గేట్ పహాడీ హనుమాన్ దేవాలయం చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్, మరియు కమిటీ సభ్యులు, బోయిన్పల్లి మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ఆమెర్, కాంగ్రెస్ నాయకులు మంద ప్రభాకర్, రమేష్, నిస్సార్, హమీద్, రామ లీల, వరలక్ష్మి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

# -అన్నదానం మహా దానం - నంగునూరి సత్యనారాయణ

- కీర్తిశేషులు చంద్రకళ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం





గజ్వేల్ ప్రజ్ఞాపూర్, జూన్ ,20,(నగరనిజం): గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద శుక్రవారం కీర్తిశేషులు నంగునూరి చంద్రకళ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని కీర్తి శేషులు నంగునూరి చంద్రకళ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, మల్యాల భద్రయ్య, కాశీనాథ్, సిరిపురం సత్యనారాయణ, ఉప్పల కృష్ణమూర్తి, గందే సంతోష్,అన్నదాన కార్యక్రమ దాతలు నంగునూరు దేవయ్య, శశి,విజయ్,కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా చెప్యాల రాజేశ్వర్ రావు జన్మదిన వేడుకలు

- జన్మదినం సందర్బంగా రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం





గజ్వేల్ ప్రజ్ఞాపూర్ , జూన్,20,(నగర నిజం): బి ఆర్ ఎస్ నాయకుడు సిద్దిపేట జిల్లా గ్రీన్ ఇండియా చాలెంజ్ అధ్యక్షులు చెప్యాల రాజేశ్వర్ రావు జన్మదినం సందర్భంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో హరిత సేన సభ్యుల ఆధ్వర్యంలో త్రిశక్తి ఆలయంలో మొక్కలు నాటడం జరిగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు శాలువాతో సత్కరించడం జరిగింది. త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేశ్వరరావు నివాసంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు, సినీ హీరో అనిల్ మొగిలి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కు చెట్లు దోహదపడతాయని.ప్రతి ఒక్కరూ,మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు, ఈ సందర్భంగా చెప్యాల రాజేశ్వర్ అభిమానులు బారీ గజమాల తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కదుల్ల ఎల్లేశం ,శ్రీరామ్ కృష్ణ ,ఎల్ల వెంకటేశం, శ్రీరామ్ రాజు, మామిండ్ల సురేష్ గౌడ్, చెక్కిళ్ల రమేష్ గౌడ్, సాయి మహేష్, కొలిశాల శ్రీనివాస్ గౌడ్, హరితసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ



గజ్వేల్ ప్రజ్ఞాపూర్, జూన్ ,20,(నగర నిజం): గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ శుక్రవారం 356 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లయన్ సంజయ్ గుప్తా, లయన్ మల్లేశం మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి రోజు ప్రభుత్వ దవాఖాన వద్ద ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో నిర్వహించడం జరుగుతుందని, ఈ రోజు నుంచి వచ్చే 15 రోజుల వరకు కీర్తిశేషులు వర్ధం పెంటమ్మ చిత్తారి దంపతుల జ్ఞాపకార్థం విజయ షాపింగ్ మాల్ అధినేత లయన్ వర్ధం రాజు కుటుంబ సభ్యుల సౌజన్యంతో అల్పాహారం అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ నేతి శ్రీనివాస్, లయన్ దొంతుల సత్యనారాయణ,లయన్ డాక్టర్ కుమారస్వామి, క్రాంతి కిరణ్, డాక్టర్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంతన్నా మాకు ఉద్యోగాలు రావా - భగ్గుమన్న నిరుద్యోగులు -

- రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల పరిపాలనా భవనం వద్ద నిరుద్యోగుల ఆందోళన
- ముందస్తు సమాచారం ఇవ్వకుండా అసిస్టెంట్ వార్డెన్ పోస్టుల భర్తీ ఇంటర్వ్యూ వాయిదా వేసిన అధికారులు
- అధికారుల తీరుపై భగ్గుమన్న నిరుద్యోగులు
- పరిపాలన భవనం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగిన నిరుద్యోగులు











రాజేంద్రనగర్, జూన్ 20(నగరనిజం ప్రతినిధి): రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిరుద్యోగుల ఆందోళనలతో అట్టుడికింది. అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అసిస్టెంట్ వార్డెన్ పోస్టుల భర్తీ ఇంటర్వ్యూ వాయిదా వేశారని ఆగ్రహిస్తూ నిరుద్యోగులు శుక్రవారం నాడు ఆందోళనకు దిగారు. నిరుద్యోగుల జీవితాలతో అధికారులు ఆటలాడుకుంటున్నారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.... రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 20 అసిస్టెంట్ వార్డెన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో శుక్రవారంనాడు ఇంటర్వ్యూలు జరుగుతాయని సంబంధిత అధికారులు ప్రకటించారు. దీంతో శుక్రవారంనాడు ఇంటర్వ్యూ కోసం రాష్ట్ర నలుమూలల నుండి వందల సంఖ్యలో అభ్యర్థు(నిరుద్యోగు) లు తరలివచ్చారు. అయితే తీరా ఇంటర్వ్యూ నిర్వహించే సమయానికి ఇంటర్వ్యూలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో నిరుద్యోగులు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటర్వ్యూలను ఎలా వాయిదా వేస్తారని నిరుద్యోగులు బగ్గుమన్నారు. ఈ మేరకు అధికారుల తీరును నిరసిస్తూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనాన్ని ముట్టడించారు. ఈ మేరకు పరిపాలన భవనం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. వుయ్ వాంట్ జస్టిస్ అని నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు.దీంతో పరిపాలన భవనం అట్టుడికింది. అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన రాజేంద్రనగర్ పోలీసులు.... ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు ఉద్యోగాలపై గంపెడాశతో సుదూర ప్రాంతాల నుండి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి తరలివచ్చిన అభ్యర్థులు అధికారుల తీరు పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రతిసారి ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు ఇవ్వడం ఆ తర్వాత ఏదో సాకుతో ఇంటర్వ్యూలను వాయిదా వేయడం పరిపాటిగా మారిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్లుగా ఉద్యోగాల కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న తమ ఆశలపై అధికారులు నీళు చల్లుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు వాయిదా వేసిఉద్యోగాలు ఎవరికి అమ్ముకుంటున్నారు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలు, జిల్లా కేంద్రాలు ఉన్నప్పటికీ అక్కడ ఇంటర్వ్యూలు నిర్వహించకుండా వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజేంద్రనగర్ లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆహ్వానించడమే విచిత్రంగా ఉందని వారు ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి అన్న మాకు ఉద్యోగాలు ఇవ్వరా అంటూ మండిపడ్డారు.అనంతరం చేసేది లేక నిట్టూరుస్తూ ఇంటిదారి పట్టారు.

# -ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన కార్యక్రమం



**గజ్వేల్ ప్రజ్ఞాపూర్ , జూన్,20,(నగర నిజం): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బింగి ఎల్లయ్య ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు పట్టాలను మన ప్రియతమ నాయకుడు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, కొండపాక ఏఎంసీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, సీనియర్ నాయకులు ముడుపు భూమిరెడ్డి,కొండపాక మండల అధ్యక్షులు వాసవి లింగారావు, గజ్వేల్ టౌన్ అధ్యక్షులు మొనగారి రాజు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.**

# హైదరాబాద్ నుండి ముంబాయి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం రద్దు

- సాంకేతిక లోపంతో దుబాయిలో నిలిచిపోయిన విమానం
- ప్రయాణికులను మరో విమానంలో ముంబాయికి తరలించిన అధికారులు




రాజేంద్రనగర్, జూన్ 20(నగరనిజం ప్రతినిధి):హైదరాబాద్ నుండి ముంబాయి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం రద్దయింది. విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు ప్రకటించాయి. దుబాయ్ నుండి శుక్రవారం నాడు హైదరాబాద్ రావాల్సిన ఎయిర్ ఇండియా విమానం ( ఏఐ 2204) విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానాన్ని దుబాయ్ ఎయిర్పోర్ట్ లోనే నిలిపివేశారు.అయితే ఈ విమానం దుబాయ్ నుండి హైదరాబాద్ కు వచ్చి అక్కడినుండి ముంబాయి వెళ్లాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా విమానం దుబాయి లోనే నిలిచిపోవడంతో హైదరాబాద్ – ముంబాయి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం (ఏఐ 2872) ను రద్దు చేసినట్లు అధికారులు శుక్రవారం రాత్రి ప్రకటించారు. అయితే ఈ విమానం రద్దు అయిన నేపథ్యంలో హైదరాబాద్ నుండి ముంబాయి వెళ్లాల్సిన 92 మంది ప్రయాణికులను తరలించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు వెల్లడించాయి.

# -ముఖ్య మంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్నగర్ ప్రతినిధి జూన్ 20 నగర నిజం నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.శుక్రవారం షాద్ నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నందిగామ మండల కేంద్రం చెందిన జిల్లేల రాం రెడ్డి గారికి మంజూరైన 1,60,000 చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య,మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సాదిక్, రవి కుమార్ గుప్తా, శ్రీధర్ రెడ్డి,సీతారాం, శ్రీహరి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీల పై అత్యాచారాలు, దౌర్జన్యాలు జరిగితే తప్పు చేసిన వారికి ఖచ్చితంగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.





వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 20 (ప్రతినిధి ఎర్రమన్ను బాలరాజు) : వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యక్రమంలోని శుక్రవారం నాడు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మొదటి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడాలని బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చచెప్పి కేసు ఉపసంహరించుకునే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండానే బయట రాజీ పడిపోవడం వల్ల చట్టం నీరుగారిపోతుందని తెలియజేశారు. అదేవిధంగా ఎక్కడైతే ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అవుతున్నాయో అది ఏ ప్రాంతంలో జరుగుచున్నాయి, ఎలాంటి కేసులు నమోదు అవుతున్నాయి అనే విషయాలు నిశితంగా గమనించి నివేదిక రూపొందిస్తే అట్టి ప్రాంతం పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించవచ్చు అని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం ఏ గ్రామంలో ఎక్కడ జరగనున్నదో ముందిగానే షెడ్యూల్ రూపొందించి కమిటీ సభ్యులకు, అధికారులకు ఇవ్వడం జరిగిందని, షెడ్యూల్ ప్రకారం పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ కమిటి సభ్యులు వెళ్ళి హాజరు కావాలని సూచించారు. పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీలకు ఎక్కడైనా అస్పృశ్యత వంటి సమస్యలు దృష్టికి వస్తె విజిలెన్స్ కమిటి సభ్యులు, పోలీస్ సిబ్బంది, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆ గ్రామానికి వెళ్లి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ చట్టం లోని షెడ్యుల్ 3 పై కమిటీ సభ్యులకు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో సమీక్ష సందర్భంగా డి.ఎస్.పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023 నుండి ఇప్పటివరకు వనపర్తి జిల్లాలో 58 ఎస్సీ, 10 ఎస్టి మొత్తం 68 అట్రాసిటీ కేసులు నమోదయాయని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో బాధితులకు మొదటి దశలో 48 మందికి చట్టం ప్రకారం నష్టపరిహారం రూ.27,2000 లు మంజూరు చేసి ఇవ్వడం జరిగిందని, రెండవ దశలో 25 మందికి 40 లక్షల రూపాయలు పరిహారంగా ఇవ్వడం జరిగింది అన్నారు 21 మందికి మంజూరు కాలేదని నివేదిక సమర్పించారు. 59 కేసుల్లో చార్జి షీట్ ఫైల్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా 108 పి.టి కేసులు నమోదు అయ్యాయని వివరించారు.జిల్లా సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 2024 నుండి ఎస్సీ ఎస్టీ 26 పోక్సో కేసులు నమోదు అయ్యాయని, వాటిలో 17 కేసులకు రూ. 6,50,000 లు పరిహారంగా అందజేయడం జరిగిందని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జిల్లా కలెక్టర్ పరిహారం రావాల్సిన ప్రతి ఒక్కరికి పరిహారం ఇచ్చే విధంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ కు నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ కమిటి సభ్యుడు ఎడవల్లి వీరప్ప మాట్లాడుతూ బుడగ జంగం వారి పై దాడులు జరుగుచున్నాయని, ముమ్మాలపల్లి, గోపాల్ పేట మండలం చాకల్ పల్లి లో బుడగ జంగం వారికి బెదిరించడం, రచ్చకట్ట పై కూర్చోకుండా చేయడం వాటి దౌర్జన్యాలు జరుగుచున్నాయన్నారు. స్పందించిన కలెక్టర్ బెదిరించే వారిపై కేసులు నమోదు చేసి తన దృష్టికి తీసుకురావాలని అదేవిధంగా కమిటీ సభ్యులు వెళ్ళి బుడగ జంగాల ప్రజలకు ధైర్యం చెప్పాలనీ సూచించారు. బుడగ జంగం విద్యార్థులకు ఎవరికైన హాస్టల్ వసతి, పాఠశాలలో సీటు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, ఈ డి ఎస్సి కార్పొరేషన్ మల్లికార్జున్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం పిడి డి ఆర్ డి ఓ ఉమాదేవి, కమిటీ సభ్యులు అగ్రికల్చర్ అధికారి గోవింద్ నాయక్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డి డబ్ల్యు ఓ సుధారాణి, సి. విశ్వం బాబు, నాగన్న, రామచందర్, వీరప్ప మాదారి భోజరాజు, స్వచ్ఛంద సంస్థల నుండి చిన్నమ్మ థామస్, ఏకే హమర్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర: డిఇఓ రమేష్ కుమార్





నాగర్ కర్నూల్ జిల్లా జూన్ 20 ( నగరనిజం ) ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం లింగాల మండలంలోని బాకారం, సూరపూర్, లింగాల ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలను డిఇఓ రమేష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ..... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని ఉపాధ్యాయులను డిఇఓ కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరియు సమాజానికి నమ్మకం పెంచడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని డిఇఓ రమేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులుగా మేము సిద్ధంగా ఉన్నామని, కావున తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని అన్నారు. విద్యా వ్యవస్థను ముఖ్యంగా ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులుగా మనపై ఉందని ప్రతి ఒక్కరు గుర్తించాలని డిఇఓ సూచించారు.ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు నోటి పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, వర్క్ బుక్కులు ఇవ్వడం, మధ్యాహ్నం భోజనంలో నాణ్యతను పెంచడం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు తెలుపాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల చర్యలతో సర్కారు స్కూళ్లపై ప్రజలు కోల్పోయిననమ్మకాన్ని నిలబెట్టే లా చర్యలు తీసుకోవాలని డిఇఓ సూచించారు.డిఇఓ రమేష్ కుమార్ వెంట జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ మానపాడు నరసింహులు ఉన్నారు.

# అనాజ్ పూర్ గ్రామ బీజేపీ శాఖకు కొత్త అధ్యక్షుడిగా కడారి శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎంపిక



అనాజ్‌పూర్, జూన్ 20 (నగర నిజం):అనాజ్ పూర్ గ్రామ బీజేపీ శాఖకు కొత్త అధ్యక్షుడిగా కడారి శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రముఖ కార్యకర్తల సమక్షంలో సమావేశం నిర్వహించబడింది. పార్టీలో పలు దశాబ్దాలుగా క్రియాశీలంగా ఉన్న కడారి శ్రీనివాస్ యాదవ్ సేవలను దృష్టిలో ఉంచుకుని ఆయనను అధ్యక్ష పదవికి ఎంపిక చేసినట్టు పార్టీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా పల్గొన్న అంకుష్ ముదిరాజ్, గుండ్ల రమేష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి సహా పలువురు కార్యకర్తలు హాజరై, శ్రీనివాస్ యాదవ్‌ను పుష్పగుచ్ఛాలతో సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కడారి శ్రీనివాస్ మాట్లాడుతూ, “బీజేపీ కేంద్ర మరియు రాష్ట్ర నాయకత్వ మార్గదర్శకాల్లో గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. యువతను రాజకీయ సాంఘికంగా చైతన్యవంతం చేయడం, పార్టీ బలోపేతానికి నిత్యం కార్యాచరణతో ముందుకు సాగుతాను,” అని తెలిపారు. గ్రామాభివృద్ధికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వేదికగా ఉపయోగించుకుంటానని స్పష్టం చేశారు.పార్టీలో ఈ కొత్త నాయకత్వ మార్పుతో స్థానికంగా కొత్త ఉత్సాహం నెలకొంది.

# విద్యార్థులు క్రమశిక్షణ పట్టదలతో చదువుకోవాలి : కొత్తపల్లి జైపాల్ రెడ్డి

## పసుమాముల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ



పెద్ద అంబర్పేట నగర నిజం జూన్ 30 : విద్యార్థులు క్రమశిక్షణ పట్టదలతో చదువుకోవాలని పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. అంబర్పేట మున్సిపాలిటీ పసుమానులలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు పెన్సిల్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. అదేవిధంగా పాఠశాలకు పెయింటింగ్ కూడా వేయించాలని కోరారు. అందుకు స్పందించిన జయపాల్ రెడ్డి పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీని ఇచ్చారు. పాఠశాల అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చర్లపల్లి శంకరయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ సర్పల్లి నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ పాడి జంగయ్య, నాయకులు బక్కి యాదయ్య గౌడ్, పర్వత్ శ్రీనివాస్ రెడ్డి, చిట్టి రాజు గౌడ్, సంఘీ బిక్షపతి, కూతాడి మల్లేష్, బండ్లగూడెం వెంకటేష్ గౌడ్, కాటం భాస్కర్ గౌడ్, చర్లపల్లి బాబుగౌడ్, గూడపు దర్శన్ గౌడ్, కొత్తపల్లి సందీప్ రెడ్డి, ఏల మధుసూదన్, గగనం శేఖర్, బండ్లగూడెం రాజు, చెవుల మణికిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబురావు, ఉపాధ్యాయులు వాణికళ, సురేష్, సాయి, శ్రీలత, రేఖ తదితరులు ఉన్నారు.

# నగర నిజం కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన

- యువ నాయకులు గౌని కాడి యాదయ్య









నగరనిజం

ఇండ్ల మధ్యలో ఉన్న కంప చెట్లను తొలగించాలి

- యువ నాయకులు గౌనికాడి యాదయ్య

వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 19వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట లో ట్రాన్స్ఫార్మర్ల దగ్గర బుధవారం నాడు సందర్శించి ఇండ్ల మధ్యలో విపరీతంగా కంపతారు చెట్లు, కలుపు మొక్కలు పెరిగాయని సామాజిక కార్యకర్త గౌనికాడి యాదయ్య అన్నారు.పీర్లగుట్ట పంచముఖి అంజనద్రి గుడి దగ్గర గల ట్రాన్స్ఫార్మర్ దగ్గర మొలిసిన కంప చెట్లను, కలుపు మొక్కలను అలాగే పోలీస్ క్వార్టర్స్ కి వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్ఫారం దగ్గర కంపచెట్లు విపరీతంగా పెరిగాయని వాటిని అధికారులు సంబంధిత సిబ్బందితో తొలగించాలని కోరారు. కంప చెట్లు దట్టంగా పెరగడంతో రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదం జరిగే పరిస్థితి ఉందన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభం అవుతుంది కాబట్టి ఇ మాలాగుట్ట ప్రాంతంలో ఇళ్ల మధ్యలో దట్టంగా మొలచిన కంపచెట్లలో వర్షపు నీరు చేరి నీటి కుంటలాగా తయారవుతుంది కాబట్టి మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కంపతారు చెట్లను తొలగించి మురికి కాలువలు లేక మురికి నీరు ఇళ్ల మధ్యలోనే నిలిచిపోతున్నాయి కావున అధికారులు ఈ మురికి నీరు ముందుకు పారుతూ వెళ్లే విధంగా చేయాలని కోరిన సామాజిక కార్యకర్త గౌనికాడి యాదయ్య

20 Jun 2025 - Page 7
www.nagaranijam.com

వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 30 వనపర్తి పట్టణం పీర్లగుట్ట ప్రాంతంలో ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ వెలసిన పిచ్చి కలుపు మొక్కలను మంగళవారం నాడు ఈ యొక్క సమస్యపై వెల్లడించడం జరిగింది , శుక్రవారం నాడు స్పందించిన విద్యుత్,మున్సిపల్ అధికారులు తొలగించినందున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన సామాజిక కార్యకర్త గౌని కాడి యాదయ్య. అయన మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ మళ్ళీ పిచ్చి మొక్కలు పెరుగకుండా చూడాలన్నారు. నిత్యం ఇ ట్రాన్స్ఫార్మర్లు ఉండే రోడ్డు వెంబడి వాహనాదారులు,ప్రజలు, చిన్నపిల్లలు అతి ఎక్కువ గా తిరుగుతూ ఉంటారు. ఈ ట్రాన్స్ఫార్మర్లు రోడ్డు అంచున ఉన్నందున ఎలాంటి ప్రమాదలు జరగకముందే విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి అని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా పథకం రైతుల హృదయాలను గెలుచుకుంటోంది

## బోడుప్పల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్లమాస మధుసూదన్ గౌడ్





బోడుప్పల్, జూన్ 20 (నగర నిజం):తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా పథకం రైతుల హృదయాలను గెలుచుకుంటోంది. ఐదు నుంచి ఆరు ఎకరాల వరకూ భూమి కలిగిన రైతులకు ఆర్థిక సాయం ఇవ్వడం ద్వారా వారి భారం తగ్గించడమే కాకుండా, సాగు పట్ల ఉత్సాహాన్ని పెంపొందిస్తోంది.ఈ సందర్భంగా బోడుప్పల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్లమాస మధుసూదన్ గౌడ్, ఎన్.ఐ.ఎన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రటరీ నంగునూరు నాగరాజ్, నూతన గౌడ్ సంఘం అధ్యక్షుడు మొరిగడి ఉపేందర్ గౌడ్ కలిసి వ్యవసాయ శాఖ మంత్రిని మరియు రాష్ట్ర నాయకుడైన తుమ్మల నాగేశ్వరరావును కలిసారు.రైతు భరోసా అమలులో ప్రభుత్వ విజన్ స్పష్టంగా కనిపిస్తోందని వారు ప్రశంసించారు. కష్టాల్లో ఉన్న రైతులకు మద్దతుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించడాన్ని కూడా వారు అభినందించారు.ఈ కార్యక్రమం అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ, “ఇది రైతుకు భరోసా మాత్రమే కాకుండా, భవిష్యత్తు పట్ల ఆశను కలిగించే పథకం. రైతాంగాన్ని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమైనవి,” అని పేర్కొన్నారు.

# ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత సహకారంతో విద్యా సహాయ కార్యక్రమం






సాహెబ్‌నగర్, జూన్ 20 (నగర నిజం):సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో ముందుండే ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బి.ఎన్.రెడ్డి డివిజన్‌కి చెందిన టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత సహకారంతో విద్యా సహాయ కార్యక్రమం నిర్వహించారు.సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్సిల్స్, పెన్స్, స్కేల్స్ వంటి విద్యా అవసరాల సరఫరా చేయడం జరిగింది. విద్యార్థులు ఆనందంతో కార్యక్రమంలో పాల్గొనగా, వారి ముఖాల్లో చిరునవ్వులు పరచుకొన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపొందించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్, ఉపాధ్యాయులు శేఖర్, రేటినేని వెంకటేశ్వరరావు, పద్మ అక్క, ప్రసన్న, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ముతూత్ సంస్థ తరఫున జోనల్ మేనేజర్ బి. సంపత్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), రీజినల్ మేనేజర్ పి. అనూప్ (హైదరాబాద్-1), సామాజిక బాధ్యత విభాగం మేనేజర్ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ అనివాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా గద్దె విజయ్ నేత మాట్లాడుతూ, “పిల్లలు దేశ భవిష్యత్తు. వారికి సరైన విద్యా వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ముతూత్ ఫౌండేషన్‌తో కలిసి మేము చేయిస్తున్న ఈ కార్యక్రమం చిన్నారులపై ఒక చిన్న ఆశాజ్యోతి రగిలించగలగాలి” అన్నారు.ఇతర స్థానిక నాయకులు, సమాజ సేవకులు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం కలిగించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని హర్షించి, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE